ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

మంగళవారం 13 ఆగస్టు 2024



చందుర్తి కేజీబీవీ ఆవరణలో మురికినీరు



సమస్యలతో సతమతం

కార్పొరేట్ చదువులు అందుకోలేక పేదరికాన్ని జయిస్తూ గురుకుల విద్యాలయాల్లో చేరిన పేద విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారు. కార్పొరేట్ స్థాయి విద్యను అందించడానికి గురుకులాలను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వాలు చెబుతూ వస్తున్నా అసౌర్యాల మధ్యే చదువు సాగిస్తున్నారు. నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, వసతులు కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యం ఆచరణలో కనిపించడం లేదు. మహాత్మా జ్యోతిబాపూలే సాంఘిక సంక్షేమం, మైనార్టీ రెసిడెన్షియల్, గిరిజన గురుకులాలు, హాస్టళ్లలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు చూసి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. జ్వరాలతో బాధపడుతూ... అనారోగ్యం పాలై మృత్యువాత పడిన సంఘటనలు విద్యార్థుల తల్లిదండ్రులను నిత్యం వేధిస్తున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గురుకుల పాఠశాలలపై 'ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్'విజిట్ చేసింది. పాఠశాలల్లో ఉన్న పరిస్థితులు అవేదన కలిగిస్తున్న తీరును తెలుసుకోవడానికి ఆంక్షలు ఉన్నట్లు చెబుతూ పాఠశాలల్లోకి అనుమతించని పరిస్థితులు ఉన్నాయి. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలు, కనీస సౌకర్యాలు లేని పరిస్థితులు కనిపించాయి. ఒకచోట మంజూరైన గురుకులాలు మరోచోట కొనసాగుతున్న తీరు కూడా జిల్లాలో ఉంది. -ఆంధ్రజ్యోతి సిరిసిల్ల నెట్‌వర్క్



వేములవాడ మైనార్టీ పాఠశాలలో ఇరుకు గదుల్లో విద్యార్థులు



వేములవాడ మైనార్టీ పాఠశాలలో అపరిశుభ్రత

- గురుకులాల్లో విద్యార్థుల అవస్థలు
- జ్వరాలతో తల్లిదండ్రుల భయాందోళన
- అద్దె భవనాల్లో ఇబ్బందులు
- అపరిశుభ్రత, దోమల విజృంభణ
- పిచ్చి మొక్కలతో పాముల సంచారం
- జిల్లాలో 6,724 మంది విద్యార్థులు

సిరిసిల్ల జిల్లాలో 13 కేజీబీవీ, 7 తెలంగాణ మోడల్ స్కూల్‌లు, ఒక అర్బన్ రెసిడెన్సియల్, రెండు మైనార్టీ రెసిడెన్షియల్, తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 6,724 మంది విద్యార్థులు చదువుతున్నారు. కేజీబీవీలో 1790 మంది విద్యార్థులు ఉండగా మోడల్ స్కూల్‌లలో 4059 మంది, రెసిడెన్షియల్‌లో 770 మంది, అర్బన్ రెసిడెన్సియల్‌లో 105 మంది విద్యార్థులు చదువుతున్నారు.

బాలికలు చదివే కేజీబీవీలోకి అనుమతించకపోయినా ప్రిన్సిపాల్, విద్యార్థుల తల్లిదండ్రుల ద్వారా విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై వివరాలు తెలుసుకున్నారు. అక్కడున్న పరిస్థితులను పరిశీలించారు. బోయినపల్లికి సంబంధించిన కేజీబీవీ సౌకర్యాలు లేకపోవడంతో వేములవాడలో అద్దె భవనంలోకి మార్చినా సరైన సౌకర్యాలు లేవు. విశాలమైన గదులు, ఇతర సౌకర్యాలు లేక ఇబ్బందులు పడ్డారు.

➡ **ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేటలో** బాలికల అదర్శ పాఠశాలలో వంద మంది విద్యార్థులకు బదులుగా 30 మంది విద్యార్థినిలు మాత్రమే ఉన్నారు. వాష్‌రూంలు, పడుకునే గదులకు సైతం తలుపులు లేవు. దుప్పట్ల పంపిణీ జరుగలేదు. వైద్య పరీక్షలు సరిగ్గా జరగడం లేదని విద్యార్థులు తెలిపారు. సాయంత్రం యువకులు హాస్టల్ వద్దకు వస్తున్నట్లుగా తెలిపారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శివారులో ఇప్పలపల్లె వద్ద అద్దె భవనంలో మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో 420 మంది విద్యార్థులు కొనసాగుతున్నారు. అద్దె భవనం కావడంతో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు లేవు. ఫ్యాన్లు పనిచేయడం లేదని, దోమలు ఇతర అవస్థలు పడుతున్నట్లుగా విద్యార్థులు తెలిపారు. పాఠశాల చుట్టూ మురికి నీరు పారడంతో దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు జ్వరాలతో బాధపడుతున్నారు.

➡ **గంభీరావుపేట** మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాల నర్మాలలో గురుకుల ఆశ్రమ పాఠశాల, దమ్మనపేట మోడల్ స్కూల్‌లో 601 మంది విద్యార్థులు చదువుతున్నారు. నర్మాల గురుకుల పాఠశాలలో కంపౌండ్ వాల్ తక్కువ ఎత్తులో ఉండడంతో అడవి పందులు, రాత్రి వేళల్లో వస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. పాముల బెడదతో ఇబ్బంది పడుతున్నారు. మిషన్ భగీరథ నీరు రాని సమయంలో నీటి సమస్యలో ఇబ్బంది పడుతున్నారు. బోర్ ఉన్నా మోటార్ కాలిపోయింది.

గంభీరావుపేటలో కేజీబీవీలో వాష్‌రూంలు సరిపడా లేక ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణం చేపట్టినా మధ్యలోనే ఆగిపోయింది.

➡ **వీర్నపల్లిలో** అదర్శ గురుకుల పాఠశాల, కేజీబీవీలో సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అదర్శ పాఠశాలలో దోమలు వీపరీతంగా ఉండడంతో జ్వరాల బారిన పడుతున్నారు. ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు పనిచేయడం లేదు. వసతి గృహంలో కిటికీలు లేకపోవడంతో కోతులు లోపలికి వస్తున్నాయి. వాష్‌రూం సౌకర్యం లేదు. కేజీబీవీలో బెడ్లు లేకపోవడంతో నేల పైనే పడుకుంటున్నారు. వర్షం వస్తే పాఠశాలకు వెళ్లే దారి మూసుకుపోతుంది.

➡ **తంగళ్లపల్లి మండలం పద్మనగర్‌లో** కేజీబీవీలో 346 మంది విద్యార్థినిలు ఉన్నారు. పాఠశాల ఆవరణ శుభ్రంగా లేకపోవడం, పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో పాములు, ఎలుకలు తిరుగుతున్నాయి. నాణ్యమైన బియ్యం సరఫరా కాకపోవడంతో అన్నంలో పురుగులు వస్తున్నట్లు చెబుతున్నారు. నేరెళ్ల గురుకుల కళాశాలలో 600 మంది విద్యార్థినిలు ఉన్నారు. మిషన్‌భగీరథ నీళ్లు రావడం లేదు. రెండు బోర్లు ఉన్నా ఒక బోర్‌లో నీరు అందడం లేదు. విద్యార్థులు తరచూ జ్వరాలకు గురువుతున్నారు.

➡ **చందుర్తి మండలం కేంద్రంలో కేజీబీవీలో** డ్రైనేజీ లేకపోవడంతో మురికి నీరు కళాశాల ఆవరణలోనే నిల్వ ఉండడంతో దోమలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

➡ **వేములవాడలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో** 250 మంది విద్యార్థులు ఉన్నారు.. భవనం పైభాగంలో నిర్మాణ పనులు జరగడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని విద్యార్థులు భయాందోళనతో చదువుతు న్నారని, నిర్మాణ పనులు జరగడంతో వాటర్ కిందకు వచ్చి క్లాస్ రూమ్‌లతో పాటుగా ఇతర గదుల్లోకి వచ్చి ఇబ్బందికరంగా ఉందని విద్యార్థులు పేర్కొంటున్నారు. దోమల బెడద ఎక్కువగా ఉటుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాల, అల్మాస్‌పూర్‌లలోని గురుకుల పాఠశాలలు ఉన్నాయి. దుమాలలో 463 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలల్లో విద్యార్థులు జ్వరాలతో బాధపడుతున్నారు.



గంభీరావుపేట కేజీబీవీలో నిలిచిపోయిన వాష్‌రూం నిర్మాణాలు



సిరిసిల్ల ఇప్పల్లపల్లెలో అద్దె భవనంలో కొనసాగుతున్న పాఠశాల

చాలా చోట్ల పారిశుధ్యలోపం..

జిల్లాలోని గురుకులాల్లో చాలా చోట్ల పారిశుధ్య సమస్యలే ఉన్నాయి. పెరిగిన పిచ్చిమొక్కలు, గడ్డితో దోమలు విజృంభిస్తున్నాయి. మరోవైపు చుట్టు పక్కల పొలాలు, తోటలు ఉండడంతో పాములు కూడా పాఠశాల ఆవరణలో తిరుగుతున్నాయి. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన అనిరుధ్ అనే విద్యార్థి మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో పాముకాటుకు గురై మృతిచెందడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. గదులకు సరైన డోర్లు, కిటీకీలకు మెష్‌డోర్‌లు లేక దోమలు విజృంభిస్తున్నాయి. ఇరుకు గదుల్లోనే డార్మెటరీలు కొనసాగుతున్నాయి. మరుగుదొడ్లు, మూత్రశాలలకు కూడా డోర్లు పాడై ఇబ్బందులు పడుతున్నారు. దోమలతో విద్యార్థులు విషజ్వరాల బారిన పడుతున్నారు.

హాస్టల్ ఆవరణలో చీకటిగా ఉంటుంది

- శిరీష, హాస్టల్ విద్యార్థి, ఇల్లంతకుంట



హాస్టల్ ఆవరణలో లైట్లు లేకపోవడంతో చీకటిగా ఉండి బయటకు రావడానికి భయం వేస్తుంది. కొన్ని వాష్‌రూంలకు తలుపులు లేకపోవడంతో ఉన్నవాటితోనే సర్దుకుంటున్నాం. నాప్‌కిన్స్, దుప్పట్లు ఇవ్వలేదు. దోమలు ఎక్కువగా ఉండటం వల్ల ఇబ్బంది అవుతుంది. పాఠశాల ప్రారంభం అయినప్పటి నుంచి వైద్యపరీక్షలు జరుపలేదు. జ్వరం వస్తే హాస్టల్‌లో ఉండే మాత్రలు వేసుకుంటున్నాం.

దోమల బెడద ఎక్కువగా ఉంది

స్రవంతి, ఆదర్శ పాఠశాల, వీర్నపల్లి



హాస్టల్‌లో ఫ్యాన్లు, ట్యూబ్‌లు సరిగా పనిచేయడం లేదు. దోమల బెడద ఎక్కువగా ఉంది. హాస్టల్ చుట్టూ చెట్లు, గడ్డి పెరగడంతో భయంగా ఉంది. కిటీకీలు సరిగా లేకపోవడంతో కోతులు రూముల్లోకి వస్తున్నాయి. క్రీడా మైదానం సరిగా లేదు. అన్ని పురుగులు తిరుగుతున్నాయి.

తోటపల్లికి నీటి విడుదల



కుడికాలువ నుంచి విడుదల అవుతున్న నీరు

ఇల్లంతకుంట, ఆగస్టు 12: మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచనల మేరకు ఇరిగేషన్ అధికారులు మిడ్‌మానేరు కుడికాలువ ద్వారా తోటపల్లి రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేశారని మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్యయాదవ్ పేర్కొన్నారు. సోమవారం కాలువ వద్దకు చేరుకుని నీటి విడుదలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన నిబంధనల ప్రకారం అన్నపూర్ణ, రంగనాయకసాగర్‌లకు మధ్యమానేరు నుంచి నీటిని విడుదల చేశారని తెలిపారు. ఈ నెల 15లోపు కుడికాలువకు నీటిని విడుదల చేస్తామని ఎమ్మెల్యే గతంలోనే చెప్పారన్నారు. నాయ కులు ఆనందరెడ్డి, నాగలక్ష్మి, భాస్కర్‌రెడ్డి, ఆకుల సత్యం, మాధవరెడ్డి పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలి

● కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 12: స్వాతంత్ర్య వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య వేడుకలు సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతాయని వాటి కోసం ఏర్పాట్లు చేయడంతోపాటు జిల్లాలోని ప్రతిశాఖకు చెందిన అధికారులు, సిబ్బంది, విద్యార్థులు వేడుకలకు తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలన్నారు. స్వాతంత్ర్య వేడుకల నేపథ్యంలో వివిధ శాఖల ద్వారా స్టాళ్ల ప్రదర్శన చేపట్టాలని , ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించాలన్నారు. దేశభక్తి గేయాలతో కూడిన నృత్య ప్రదర్శనలు సాంస్కృతిక కార్యక్రమాల కింద ఏర్పాటు చేయాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణ వీలుగా జూనియర్ కళాశాల మైదానాన్ని పూర్తిస్థాయిలో శుభ్రం చేయాలని సిరిసిల్ల మున్సిపాలిటీ కమిషనర్‌ను ఆదేశించారు. వేడుకలకు సంబంధించి ప్లాగ్ ఏర్పాట్లు గ్రౌండ్ సిద్ధం చేయడం మొదలైన పనులతోపాటు ఏర్పాట్లును పోలీస్, రెవెన్యూ శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో పూర్తిచేయాలని కోరారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేసేందుకు ప్రతిపాదనలు అగస్టు 14లోగా పంపాలన్నారు. ముఖ్య అతిథి సందేశం అందించేందుకు వీలుగా స్పీచ్‌కాపీలను రూపకల్పనకు ప్రతి శాఖ క్లుప్తంగా నివేదికలను డీపీఆర్వోకు అందజేయాలన్నారు. స్వాతంత్ర్య వేడుకల వేదిక, సీటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తిచేయాలని ప్రొటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు చేయాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులను అహ్వానించాలన్నారు. జిల్లాలో నేతకార్మికులు, ప్రముఖ వ్యక్తులు వేడుకలను హాజరయ్యేలా చూడాల న్నారు. ప్రతి ప్రభుత్వశాఖ వారి కార్యాలయంలో వేడకలను నిర్వహించి జిల్లాలో జరిగే వేడుకలకు హాజరుకావాలని విద్యుత్ అంతరాయం కలుగకుండా సెస్ అధికారులు చూడాలని కోరారు. పట్టణంలోని స్వశక్తి మహిళా సంఘాల ప్రతి నిధులు హాజరయ్యేలా మెప్మా అధికారులు చర్యలు తీసుకోవాలని అదేవిధంగా ఏఎస్‌ఎం అధ్వర్యంలో వైద్యబృందాలచే శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లాకలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా

ఇల్లంతకుంటలో పోలీసుల తనిఖీలు

ఇల్లంతకుంట, ఆగస్టు 12: మండల కేంద్రంలోని మహారాజుల కాలనీ సమీపంలో ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం నాకాబందీ నిర్వహించారు. ఈ నెల 15న జరుగనున్న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందు జాగ్రత్తగా తనిఖీలు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..

గురుకులాలు, హాస్టళ్లపై బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో అధ్యయనం

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 12: గత ఎనమిది నెలలుగా ప్రభుత్వ గురుకులాలు, హాస్టళ్లను పట్టించుకునే వారు లేరని... గతంలో గురుకులాల ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన మాజీ ఐపీఎస్ అధికారి, ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో బీఆర్ఎస్ పక్షాన గురుకులాలు, హస్టళ్లలోని దుస్థితులపై అధ్యాయనం చేపట్టి ప్రభుత్వానికి సమర్పిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కే.టీ.రామారావు అన్నారు. రాజకీయాలకు తావివ్వకుండా ప్రభుత్వం బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, జిల్లా కలెక్టర్లు, అధికారులు హస్టళ్లను దత్తత తీసుకుని పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని సర్కారుకు విజ్ఞప్తి చేస్తున్నానని పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో ఇటీవల జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకులంలో మృతి చెందిన ఆరో తరగతి విద్యార్థి ఎడమల అనిరుథ్ కుటుంబ సభ్యులను సోమవారం ఆయన పరామర్శించారు. విద్యార్థి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ అపరిశుభ్ర వాతావరణంలో పాఠశాల ఆవరణలోకి పాములు రావడం వల్ల విద్యార్థులు మృతి చెంది రాష్ట్రంలో ఎంతో మంది తల్లిదండ్రుల కడుపు కోతకు కారణమవుతోందని అన్నారు. విద్యార్థులు పాము కాటు, కల్తీ ఆహారం వల్ల చనిపోవడం బాధకరమని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయం అవసరం లేదని అన్నారు. గతంలో బాసర ట్రిపుల్ ఐటీ, తదితర ఘటనలు జరిగినప్పుడు తాము అక్కడకు వెళ్లి ప్రత్యక్షంగా చూసి సమస్యలను నేరుగా తెలుసుకుని భరోసా ఇచ్చే ప్రయత్నం చేశామని పేర్కొన్నారు. సర్కారు కూడా అలాంటి చర్యలు తీసుకోవాలని అన్నారు. కలెక్టర్లు, ఐపీఎస్ అధికారులున్నారని అవసరమైతే ఒక్కోక్కరిని రెండు, మూడు హాస్టళ్లను దత్తత తీసుకునేలా చర్యలు చేపట్టాలని అన్నారు. వారంలో ఒక రోజు అధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేసేలా ఆదేశాలివ్వాలని అన్నారు. గురుకులాలు, హస్టళ్ల, పాఠశాలల ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. బడిలో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్లు కృష్ణారెడ్డి, భాస్కర్‌గౌడ్, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, తాజా, మాజీ ఎంపీపీ రేణుక, తాజా, మాజీ ఎంపీటీసీలు గీతాంజలి, అనసూయ, మధు, శ్రీనివాస్, నాయకులు రాఘవరెడ్డి, సుభాష్, నర్సింహారెడ్డి, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేటీఆర్

● మా కొడుకు మంచిగ చదువుకుని మమ్మల్ని చూసుకుంటడనుకుంటే.. ఇలా జరిగిందిజ. తల్లిదండ్రులు సార్లే అనుకుని ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తే గింత ఘోరం అవుతదని అనుకోలేదు.. సారూ నాలాగా ఏ తల్లికి కడుపు శోకం రాకుండా చూడండి అంటూ మృతి చెందిన విద్యార్థి అనిరుధ్ తల్లి ప్రియాంక కన్నీరుమున్నీరుగా రోదించింది. ధైర్యంగా ఉండాలని కుటుంబానికి కేటీఆర్ భరోసా ఇచ్చారు.

బాలికపై అత్యాచారయత్నం కేసులో
నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష

జగిత్యాలరూరల్, ఆగస్టు 12: ధర్మపురి పోలీస్‌స్టేషన్ పరిధిలోకి చెందిన బాలికను నిందితుడు సాయిని గంగన్న (26)అనే వ్యక్తి అత్యాచారయత్నం చేసిన ఘటనలో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి నీలిమ సోమవారం తీర్పు వెలువరించారు. ఘటన జరిగిన సమయంలో పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో ఆధారా లు సమర్పించారు. సాక్షులను విచారించిన జగిత్యాల న్యాయమూర్తి నీలిమ ఈ మేరకు తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో నేరం చేసినవారు శిక్ష నుంచి తప్పించు కోలేరన్నారు. నిందితుడికి జైలుశిక్ష పడేందుకు కృషి చేసిన పీపీ మల్లికార్జున్, ఎస్సై శ్రీకాంత్, సీఎంఎస్ ఎస్‌ఐ రాజునాయక్, కోర్టు కానిస్టేబుల్స్ కిరణ్, రాజులను జిల్లా ఎస్పీ అభినందించారు.

కస్టమర్ కేర్ నంబర్‌కు ఫోన్ చేస్తే నగదు మాయం

జమ్మికుంట రూరల్, ఆగస్టు 12: జమ్మికుంట మండలం నాగంపేట గ్రామానికి చెందిన పంజాల తిరుపతి అనే వ్యక్తి తన స్నేహితుడికి ఫోన్‌పే ద్వారా కొంత నగదును పంపాడు. నగదు ట్రాన్స్‌ఫర్ కాకపోవడంతో గూగుల్‌లో సెర్చ్ చేసి ఆంధ్రాబ్యాంక్ కస్టమర్ కేర్ నంబర్‌కు ఫోన్ చేశాడు. వారు అడిగిన వివరాలన్నీ చెప్పాడు. అప్పటి నుంచి విడతల వారీగా 1,40,999 రూపాయలు బ్యాంకు ఖాతా నుంచి మాయమయ్యాయి. వెంటనే తిరుపతి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

కారును ఢీ కొన్న డీజిల్ ట్యాంకర్

శంకరపట్నం, ఆగస్టు 12: మండలంలోని కొత్తగట్టు శివారులో కరీంనగర్- వరంగల్ రహదారిపై సోమవారం కారును డీజిల్ ట్యాంకర్ వెనుక నుంచి ఢీ కొట్టిం ది. స్థానికుల కథనం ప్రకారం వరంగల్ వైపు నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న కారు ను వెనక నుంచి వస్తున్న డీజిల్ ట్యాంకర్ ఢీ కొట్టింది. దీంతో కారు వెనుక భాగం దెబ్బతిన్నది. కారులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న కేశవపట్నం బ్లూకోల్ట్స్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి/రామడుగు/బోయినపల్లి/ఇల్లంతకుంట, ఆగస్టు 12: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. సోమవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 3,580 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి ఒక మోటార్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీ కి, హైదరాబాద్, ఆయా నియోజకవర్గాల ప్రజల తాగునీటి అవసరాల కోసం 430 క్యూ సెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.890 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. ప్రాజె క్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు లేక వరద తగ్గడం తో ఒక మోటార్ ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. మిడ్ మానేరు ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 16.49 టీఎంసీల నీరు ఉంది. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400, కుడి కాలువకు వంద క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఇల్లంతకుంట మండలంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 1.13 టీఎంసీల నీరు చేరింది. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి మధ్యమానేరు ద్వారా వచ్చిన 6,400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి సిద్దిపేట జిల్లాలోని రంగనాయకసాగర్‌కు 6,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కాకతీయ కాలువకు..

జగిత్యాల, ఆంధ్రజ్యోతి: శ్రీ రాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదలను సోమవారం అధికారులు కొన సాగించారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 3,000 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎస్సారెస్పీలోకి 4,083 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 47.25 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర ములకు కలిపి ప్రాజెక్టు నుంచి 4,083 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

పీఏసీఎస్ సభ్యులు
విధిగా కేవైసీ చేయించుకోవాలి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 12: కరీంనగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలోని 128 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్) సభ్యులంతా తప్పనిసరిగా కేవైసీ వివరాలను డిజిటలైజేషన్ చేయించుకోవాలని బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణ అధికారి ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని కేడీసీసీ బ్యాంకుకు అనుబంధంగా ఉన్న సంఘాల్లోని సభ్యుల కేవైసీ వివరాలను ఆయా సంఘాల్లో కంప్యూటరైజేషన్ చేస్తున్నట్లు తెలిపారు. ఆధార్‌కార్డు, పాన్‌కార్డు జిరాక్సు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకొని ఆయా సంఘాల్లో సంప్రదించాలని సూచించారు.

అత్త వేధింపులు భరించ లేక
కోడలు ఆత్మహత్య


సృజన (ఫైల్)

కోరుట్ల, ఆగస్టు 12 : కోరుట్ల పట్టణంలో అత్త వేధింపులు భరించలేక కోడలు సోమవారం ఆత్మ హత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గంగ పేట ప్రాతంలో నివాసం ఉంటున్న పులివేని నరేష్‌తో ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బ గ్రామానికి చెందిన సృజన (28) ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. నరేష్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. సృజన గంగంపేట ప్రాంతంలో ఆమె పిల్లలతో కలిసి అద్దే ఇంట్లో నివాసం ఉంటోంది. ఈ క్రమంలో సృజన అత్త ఎకశిల నిరంతరం వేధింపులకు పాల్పడేది. ఈ క్రమంలో సోమవారం ఉదయం అత్త ఎకశిల కోడలితో గొడవ పడింది. దీంతో సృజన విషయాన్ని భర్తకు ఫోన్ ద్వారా వివరించింది. తాను పిల్లలను విడిచి వెలుతున్నానని, పిల్లలను బాగా చూసుకోవాలని చెప్పి ఫోన్ పెట్టివేసి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లో నుంచి సృజన బయటకు రాకపోవడంతో చుట్టు పక్కల వారు గమనించి ఆత్మహత్య పాల్పడ్డట్లు గుర్తించారు. విషయాన్ని సృజన బంధువులకు, పోలీసులకు సమా చారం అందించారు. విషయం తెలసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి సృజన తల్లి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సృజనకు విధన్ (5), వియాన్ (3) కుమారులు, లింకారి (8నెలల) కూతురు ఉంది. తల్లి మృతదేహం వద్ద పిల్లలు అమ్మ లే అమ్మా అంటూ ఏడుస్తూ లేపే ప్రయత్నం చేస్తుండగా అక్కడ ఉన్న వారిని కంటతడి పెట్టించింది. సృజన భర్త నరేష్ గల్ఫ్ నుంచి మంగళవారం చేరుకుంటాడు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

రాజన్న క్షేత్రంలో కిక్కిరిసిన భక్తులు

● శ్రావణం సందర్భంగా పెరిగిన రద్దీ ● సాయంత్రం ఘనంగా మహాలింగార్చన


ఆలయ ఆవరణలో, క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 12 : వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర స్వామి వారి క్షేత్రం సోమవారం భక్తులతో కిక్కిరిసి పోయింది. శ్రావణ మాసం రెండవ సోమవారం సందర్భంగా భక్తుల తాకిడి పెరిగింది. ఆదివారం రోజున భక్తులు వేములవాడకు తరలివచ్చి శ్రీస్వామి వారి వసతిగదుల్లో విడిది చేశారు. సోమవారం తెల్లవారు జాము నుంచే భక్తులు కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. భక్తులు రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకునేందుకు సుమారు రెండు గంటలపాటు క్యూలైన్‌లో నిరీక్షించారు. బ్రేక్ దర్శనం, శీఘ్రదర్శనం, ధర్మదర్శనం క్యూలైన్ ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని ముందుగా శ్రీవిఘ్నేశ్వరుడిని దర్శించుకుని శ్రీపార్వతిపరమేశ్వరుల సేవ లో తరించారు. సోమవారం రాజన్న దర్శనానికి 35 వేల మంది వరకు భక్తులు వచ్చినట్లు ఆలయాధికారులు అంచనా వేస్తున్నారు. ఆలయంలో ఉదయం 5.30 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం శ్రీస్వామి వారి కల్యాణ మంటపంలో మహాలింగార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

క్యూలైన్‌లను పరిశీలించిన ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం కోడెమొక్కు, శీఘ్రదర్శనం, బ్రేక్ దర్శనం క్యూలైన్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుం డా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఏఈవో రమేష్ బాబుకు, ప్రొటోకాల్ పర్యవేక్షకులు రాజన్‌బాబులను ఆదేశించారు.


కల్యాణ మంటపంలో లింగార్చనలో పాల్గొన్న భక్తులు, బ్రేక్ దర్శనం క్యూలైన్‌లను పరిశీలిస్తున్న ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవో రమేష్‌బాబు, పీఆర్వో రాజన్ బాబు

ధర్మపురి క్షేత్రంలో శ్రావణ సందడి

శివాలయాల్లో భక్తి శ్రద్ధలతో పూజలు


రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి పూజలు

ధర్మపురి, ఆగస్టు 12: ధర్మపురి క్షేత్రంలో శ్రావణ సందడి నెలకొంది. శ్రావణ సోమవారం శివాలయాల్లో భక్తుల రద్దీ పెరిగింది. క్షేత్రానికి ఉదయం వరకు తరలి వచ్చిన భక్తులు గోదావరి నదిలో స్నానాలు చేశారు. లక్ష్మీ నరసింహ స్వామి, అనుబంధ శ్రీ రామలింగేశ్వర, క్షేత్ర సమీపంలో గల అక్కపెల్లి రాజ రాజేశ్వరస్వామి ఆలయాలకు చేరుకున్నారు. ఆలయ వేదపండితులు, అర్చకు లు శివాలయాల్లో స్వామి వారలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజ లు, అన్నపూజ, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారలను దర్శించుకున్నారు. సాయంత్రం శ్రీ రామలింగేశ్వర స్వామి వారిని నంది వాహ నంపై పుర వీధుల్లో ఊరేగించారు. స్థానిక లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శ నం చేసుకున్నారు. ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్‌శర్మ, బూస ప్రవీణ్ కుమార్, జన్మంచి శ్రీనివాస్, ద్యావళ్ల విశ్వనాథశర్మ, సాయికుమార్ పాల్గొన్నారు.


స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

కోటిలింగాలలో...


గోదావరిలో స్నానం చేస్తున్న భక్తులు

వెల్గటూర్, ఆగస్టు 12: శ్రావణ మాసం రెండో సోమవారం సందర్భంగా మండలంలోని కోటిలింగాలలో భక్తుల సందడి నెలకొన్నది. శ్రీ కోటేశ్వరస్వామికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం శివ నామస్మరణతో మారుమ్రోగింది. కోటిలింగాల గోదావరిలో భక్తులు స్నానాలు ఆచరించి గోదావరి ఒడ్డున గల గంగా మాత విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం కోటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని రావి చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేసి జంట నాగులకు ప్రత్యేక పూజలు చేసి, పాలతో అభిషేకం చేశారు. శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామిని దర్శించుకొని అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం కిట కిటలాడింది. అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మలు భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు.

నెమలి వంట.. యూట్యూబర్ రిమాండ్

తంగళ్లపల్లి, ఆగస్టు 12: నెమలి మాంసం ఎలా వండాలో చూపించిన వీడియో యూట్యూబ్‌లో వైరల్ చేసిన యూట్యూబర్ తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన కోడం ప్రణయ్‌కుమార్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్ ఆర్‌వో కల్పనదేవి తెలిపారు. జాతీయ పక్షి నెమలిని ఎలా కూర వండాలో సోషల్ మీడియాలో వైరల్ కాగా ఈ విషయం తెలుసుకున్న అటవీ శాఖాధికారులు ప్రణయ్‌కుమార్‌ను ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. యూట్యూబర్ ప్రణయ్‌కుమార్‌ను విచారించి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్ఆర్‌వో తెలిపారు.

గల్ఫ్ ఏజెంట్‌పై కేసు నమోదు

రుద్రంగి, ఆగస్టు 12: అజర్ బైజాన్ దేశం పంపిస్తానని ఓ వ్యక్తిని మోసం చేసిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు రుద్రంగి ఎస్‌ఐ అశోక్ సోమవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మానాల గ్రామానికి చెందిన కొలకాని రవి అనే వ్యక్తిని అజర్ బైజాన్ అనే దేశం పంపిస్తానని రూపాయలు 2.75,000 తీసుకొని వీసా ఇవ్వకపోవడంతో పాటు, డబ్బులు తిరిగి ఇవ్వకుండా నమ్మించి మోసం చేశాడని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అగ్నిర కిషన్‌పై ఇప్పటికే రుద్రంగి పోలీస్ స్టేషన్లో రెండు కేసులు నమోదు కాగా వివిధ పోలీస్‌స్టేషన్‌లో కూడా కేసులు నమోదు కావడంతో ఇప్పటికే అజ్మీరా కిషన్ జైల్లో ఉన్నట్లు తెలిపారు. బాధితులు ఎవరైనా ఉంటే నేరుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

క్రీడాకారులు ఒలింపిక్ స్థాయికి ఎదగాలి

● జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు శరత్‌కుమార్‌రెడ్డి ● ముగిసిన రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు



ట్రోఫీ, ప్రశంసాపత్రాలు అందుకున్న విజేతలతో అతిథులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 12: జిల్లా క్రీడాకారులు ఒలింపిక్ స్థాయికి ఎదగాలని జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు శరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని జీఎస్ టేబుల్ టెన్నిస్ అకాడమీలో కరీంనగర్ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ శరత్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేందర్‌సింగ్‌లు ట్రోఫీలను, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో నిర్వహి స్తున్న ఈ పోటీల్లో విజేతలకుగా నిలిచిన వారికి రూపాయలు 25 వేల నగదు బహుమతులను అందజేస్తున్నామని చెప్పారు. టేబుల్ టెన్నిస్ క్రీడతో ఏకాగ్రత, క్రమశిక్షణ పెంపొందుతుందని అన్నారు.

రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల నుంచి 200 మంది క్రీడా కారులు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. అండర్-12, 15 పురుషులు, మహిళ ల విభాగాల్లో సింగిల్స్, డబుల్స్, మిక్సడ్ డబుల్స్ పోటీలను నిర్వ హించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ కోశాధికారి దారం గౌతమ్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి మద్దెల వికాస్ కుమార్, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, కోచ్‌లు పాల్గొన్నారు.

● పోటీల విజేతలు :

పురుషుల సింగిల్స్ విభాగంలో లోకేష్ (కొత్తగూడెం), సంతోష్ (కరీంనగర్), పి.అజయ్ (కరీంనగర్) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. డబుల్స్ విభాగంలో లోకేష్, చైతన్య (కొత్తగూడెం), శైలేందర్, కిరణ్ (మంచిర్యాల) మొదటి, రెండు స్థానాల్లో నిలిచారు. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో వినయ్‌సాగర్, శ్వేత (నిజామాబాద్) ప్రథమ స్థానం, పి.అజయ్, అవనిరెడ్డి (కరీంనగర్) ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. అండర్-15 బాలుర విభాగంలో జ్వలిత్ (ఖమ్మం), పి.అజయ్ (కరీంనగర్), సార్విక్ (ఖమ్మం) మూడు స్థానాల్లో నిలువగా బాలికల విభాగంలో సత్య (మంచిర్యాల), వై.అవనీరెడ్డి (కరీంనగర్), అక్షర (నిజామాబాద్) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. అండర్-12 బాలుర విభాగంలో హితేష్ (ఖమ్మం), ఫజల్ (ఖమ్మం), వి.శ్రేయాస్ (కరీంనగర్) మొదటి మూడు స్థానాల్లో నిలువగా బాలికల విభాగంలో సింధూ (నిజామాబాద్), రవళిక (నిజామాబాద్), అనన్య (నిజామాబాద్) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

దేవాదాయశాఖ ఏసీగా
సుప్రియకు అదనపు బాధ్యతలు

నేడు బాధ్యతల స్వీకరణ



కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 12: ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమీషనర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న నాయిని సుప్రియకు ఉమ్మడి జిల్లా సహాయ కమీషనర్(ఏసీ)గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం ఆ శాఖ రాష్ట్ర కమీషనర్ హనుమంతరావు ఉత్తర్వులు జారీ చేశారు. మొన్నటి వరకు ఆమె నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి ఏసీగా కూడా అదనపు బాధ్యతలు నిర్వహించారు. తాజాగా జరిగిన బదిలీలో అక్కడికి కొత్త ఏసీ రావడంతో తిరిగి కరీంనగర్ సూపరింటెండెంట్‌గా పూర్తి బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జి ఏసీగా కూడా వ్యవహరించనున్నారు. గతంలో ఇక్కడ ఏసీగా పనిచేసిన ఆకునూరి చంద్రశేఖర్ మెదక్ జిల్లాకు బదిలీ అయ్యారు. సుప్రియ మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

బంగారం షాపులో చోరీ

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 12: పట్టణంలోని మిషన్ హైస్కూల్ ఏరియాలోగల ఓ బంగారం షాపులో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి షెట్టర్ తాళాలు పగుల గొట్టి లోనికి చొరబడి 2 తులాల బంగారం, అర కిలో వెండి అపహరించుకెళ్లారు. షాపు యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. త్వరలో దొంగలను పట్టుకుంటామని ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు.

రెండు దుకాణాల్లో..

శంకరపట్నం: మండలంలోని సైదాపూర్ ఎక్స్ రోడ్ వద్ద గల చికెన్ సెంటర్, హోటల్ తాళాలు పగులగొట్టి వాటిలో ఉన్న 15 వేల రూపాయలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. చికెన్ సెంటర్‌లో ఐదు వేలు, హోటల్‌లో 10 వేల రూపాయల దొంగతనం జరిగిందన్నారు. బాధితులు జునసూర్ తిరుపతి, చిర్ర సం తోష్‌లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కేశవపట్నం ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో..

గంగాధర: మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన సాగర్‌రెడ్డి ఆదివారం సాయంత్రం తన బంధువుల ఇంటికి వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు ఊడదీసి ఇంట్లోకి వెళ్లి బీరువాలోని 50 వేలు ఎత్తుకెళ్లారు. తలుపులు తీసి ఉండడాన్ని గమనించిన పొరుగువారు సాగర్‌కు సమాచారం అందించారు. ఆయన వచ్చి చూడగా బీరువాలోని నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కిరణ్‌రెడ్డి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

శంకరపట్నం, ఆగస్టు 12: మండలంలోని మెట్‌పల్లి గ్రామం లో సోమవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా వీణ వంక మండలం జంగంపల్లి నుంచి మెట్‌పల్లి వైపు వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను తనిఖీ చేశారు. జంగంపల్లికి చెందిన డ్రైవర్ రేగుల తిరుపతి సరైన పత్రాలు చూపకపోవడంతో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

ఘనంగా కుంకుమ పూజలు


కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

కోరుట్ల, ఆగస్టు 12 : పట్టణంలోని జవహర్ రోడ్డులోని ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణమాస రెండవ సోమవారం పురస్కరించుకొని కుంకుమ పూజా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు పాలెపు రామకృష్ణ శర్మ వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలను జరిగాయి. గణపతి, పుణ్యాహవచనం పూజలను నిర్వహించిన సామూహిక శివ ముష్టి వత్రాలను నిర్వహించారు. అనంతరం మహిళలచే కుంకుమ పూజ నిర్వహించగా అధిక సంఖ్యలో మహిళల పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు అల్లాడి ప్రవీణ్, చిద్రాల వినోద్, తాటికొండ ఆంజనేయులు, కంఠాల బాస్కర్, బట్టు హరికృష్ణ, జిల్లా శ్రీనివాస్‌లతో పాటు మహిళలు పాల్గొన్నారు.

మోసం చేసిన వ్యక్తిపై కేసు

పెగడపల్లి, ఆగస్టు 12: ఎరువులు, పురుగు మందుల దుకాణంలో పని చేస్తూ మోసానికి పాల్పడిన మారిశెట్టి మధు అనే వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్.ఐ రవికిరణ్ తెలిపారు. ఎస్.ఐ రవి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం బతికె పల్లి గ్రామానికి చెందిన మారిశెట్టి మధు అదే గ్రామానికి చెందిన క్యాస కృష్ణ అనే వ్యక్తికి చెందిన సుద్దపల్లి గ్రామంలోని ఫర్టి లైజర్ షాపులో గుమాస్తాగా పని చేస్తున్నాడు. షాపులో ఖాతాదారుల వద్ద నుంచి రూ. 2 లక్షలు వసూలు చేసుకుని వాడుకోవడంతో పాటు వాటిని కప్పి పుచ్చుకునేందుకుగాను షాపునకు చెందిన రూ. 20 లక్షల ఉద్దెర ఖాతా బుక్కులను కాల్చి వేశాడు. దుకాణ యజమాని ఇచ్చిన పిర్యాదు మేరకు విచారణ అనంతరం కేసు నమోదు చేసి మధును రిమాండ్‌కు తరలించినట్లు ఎస్.ఐ తెలిపారు.

కొండ చిలువ సంచారం



సిరిసిల్ల టౌన్, ఆగస్టు 12 : రాజన్న సిరిసిల్ల కేంద్రం లోని విద్యానగర్ శివారు ప్రాంతం వైకుంఠ ధామం ప్రాంతంలో దాదాపు ఆరు అడుగుల పొడవు ఉన్న కొండ చిలువ సంచరిస్తోంది. ఓ వ్యక్తికి కొండ చిలువ కనపడడంతో వీడియో తీసి సోమవారం సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్ అవుతుంది. ఈ దృశ్యాలను చూసిన పట్టణ ప్రజలు అటు వైపు వెళ్లడానికి సాహసించడం లేదు. కొండచిలువ సంచారంతో ఆదే ప్రాంతంలో ఉన్న బీసీ గురుకుల పాఠశాలలోని విద్యార్థులు భయపడుతున్నారు. వైకుంఠధామంకు మరో వైపు నెహ్రూపార్క్, స్విమ్మింగ్ పూల్ జనంతో నిత్యం రద్దీగా ఉంటుంది. అటు వైపు కొండ చిలువ వస్తే ఎలా అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎటువంటి ప్రమాదం జరుగకముందే అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

శంకరపట్నం, ఆగస్టు 12: ఐదు నెలల క్రితం ఓ మహి ళ పోగొట్టుకున్న మొబైల్‌ను కేశవపట్నం ఎస్‌ఐ కొత్తపల్లి రవి తిరిగి సోమవారం అప్పగించారు. ఎస్‌ఐ రవి శంకర పట్నం మండలం కన్నాపూర్‌కు చెందిన ఎండీ సఫియా ఐదు నెలల క్రితం స్మార్ట్ ఫోన్ పోయిందని సీఈ ఐఆర్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ రవి దర్యాప్తులో మొబైల్‌ని కనుక్కుని తిరిగి ఫిర్యాదుదారురాలికి అప్పగించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మల్యాల, ఆగస్టు 12: కొండగట్టులోని ఓ గదిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఏ.నరేష్ కుమార్ సోమవారం తెలిపారు. ఇందులో కొడిమ్యాలకు చెందిన ఇద్దరు, కోరుట్లకు చెందిన ఇద్దరు, మేడిపల్లి, జగిత్యాల, కొండగట్టుకు చెందిన ఒక్కరు ఉన్నా రని వారి వద్ద రూ.44,060 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

మీ పక్షాన మేం కొట్లాడుతాం

- పారిశుధ్య కార్మికులతో కేటీఆర్



బండలింగంపల్లిలో పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న కేటీఆర్

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 12 : ఏడు నెలలైనా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామని పారిశుధ్య కార్మికులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌తో మొర పెట్టుకున్నారు. ఆందోళన చెందకండి మీ పక్షాన మేం కొట్లాడుతామని కేటీఆర్ వారికి హామీ ఇచ్చారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో నుంచి బండలింగంపల్లి మీదుగా ముస్తాబాద్‌కు వెళ్తుండగా బండలింగంపల్లి గ్రామంలో పారిశుధ్య కార్మికులను చూసి కేటీఆర్ ఆగి వారితో ముచ్చటించారు. అక్కడే ఉన్న పారిశుధ్య కార్మికులు వేతనాలు రావడం లేదని కేటీఆర్‌కు తమ గోడు వెళ్లబోసుకున్నారు. స్పందించిన కేటీఆర్ వేతనాల కోసం పోరాడుతామని ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఈ ప్రభుత్వ పాలన ఎలా ఉందని కేటీఆర్ ప్రశ్నించారు. మీ హయాంలోనే బాగుందని స్పష్టం చేయడంతో మరి ప్రజలు మాకెందుకు ఓట్లు వేయలేదని అడిగారు. మిమ్మల్ని గెలిపించుకున్నాం కదా..! అని బదులివ్వడంతో కేటీఆర్ నవ్వారు.

డాక్టర్ సాబ్ బాగున్నారా.. ఆప్యాయంగా పలకరించిన కేటీఆర్

ముస్తాబాద్, ఆగస్టు 12: డాక్టర్ సాబ్ బాగున్నారా మీరు బాగుంటే మేమంతా బాగుంటామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ ముస్తాబాద్‌లోని ప్రముఖ వైద్యులు డాక్టర్ చింతోజు శంకర్‌తో ఆప్యాయంగా మాట్లాడారు. డాక్టర్ చింతోజు శంకర్ ఇంట్లో కాసేపు గడిపారు. హైదరాబాదులో ఆసుపత్రిని ఈ నెల 18వ తేదీన ప్రారంభిస్తున్నామని తప్పకుండా హాజరుకావాలని కేటీఆర్‌ను డాక్టర్ శంకర్ కోరారు. తప్పకుండా వస్తామని బదులిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మండల అధ్యక్షుడు సురేందర్రావు వైద్యులు డాక్టర్ అర్చన తదితర నాయకులు పాల్గొన్నారు.

కుడికాలువ ద్వారా నీటిని విడుదల చేయాలి

ఇల్లంతకుంట, ఆగస్టు 12: మధ్యమానేరు కుడికాలువ ద్వారా సాగునీటిని విడుదల చేయాలంటూ రైతులు రాస్తారోకో చేపట్టారు. మండలంలోని వంతడుపుల గ్రామ సమీపంలోని వంతెనపై సోమవారం రైతులు నిరసన వ్యక్తం చేశారు. వల్లంపట్ల, వంతడుపుల, కందికట్కూర్, గాలిపెల్లి తదితర గ్రామాల రైతులు నీటికోసం ఎదరుచూస్తున్నారని పేర్కొన్నారు. నాట్లు వేసే సమయం మించిపోతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఫారూఖ్ ఆందోళనకారుల వద్దకు చేసుకొని సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకవెలుతానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

● ఇల్లంతకుంట: రైతులకు సాగునీటిని విడుదల చేయకుంటే రైతులతో కలిసి మహాధర్నా చేపడుతామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం మాట్లాడుతూ అన్నపూర్ణ రిజర్వాయర్‌లో నీరు వస్తున్నా ఎగువన ఉన్న రంగనాయకసాగర్, మల్లన్నసాగర్‌కు ఎందుకు విడుదల చేస్తున్నారో రైతులకు వివరించాలన్నారు.

నేటి నుంచి రిలే నిరాహారదీక్షలు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 12: రాజన్న సిరిసిల్ల జిల్లాలో కోర్టు ఉత్తర్వుల అమలులో పోలీసుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ చేపట్టిన న్యాయవాదుల పోరాటం ఊపందుకుంది. మంగళవారం ఉదయం సిరిసిల్ల జిల్లా కోర్టు ముందు న్యాయవాదులు రిలేనిరాహార దీక్షలు చేపడుతున్నట్లు సిరిసిల్ల బార్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటి తెలిపారు. కోర్టు ఉత్తర్వుల సమస్య పరిష్కారం అయ్యేవరకు ఈ ఆందోళన కొనసాగుతుందని ఆయన తెలిపారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు

వేములవాడ టౌన్, ఆగస్టు 12 : 9వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని ఉపాధ్యాయుడు చితకబాదిన సంఘటన వేములవాడ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన సుంకపాక సాత్విక్ అనే విద్యార్థిపై పట్టణంలోని పాత కూరగాయల మార్కెట్ సమీపంలో గల ప్రైవేట్ పాఠశాల గణిత ఉపాధ్యాయుడు చేయిచేసుకున్నట్లు తెలిపారు. సంఘటనలో విద్యార్థికి మెడపై గాయాలయ్యాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై విద్యార్థి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినిపల్లి, ఆగస్టు 12: మండలంలోని రైతు వేదిక కార్యాలయంలో 23 గ్రామాలకు చెందిన 88 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ.88 లక్షల రూపాయల చెక్కులను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ముదుగంటి సురేందర్ రెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు ఏనుగుల కనుకయ్య, జిల్లా బిసి సెల్ అధ్యక్షులు కుస రవీందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి, మాజి జడ్పీటీసీ పులి లక్ష్మీపతిగౌడ్, మాజీ ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, నాయకులు నాగుల వంశీ, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మురుగు నీటి కాల్వ పైకప్పు నిర్మాణానికి చర్యలు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 12: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గిద్దె చెరువుకు వెళ్లే ప్రాంతంలో ధ్వంసమైన మురుగు నీటి కాల్వ పైకప్పు నిర్మాణానికి చర్యలు చేపట్టామని ప్రత్యేక అధికారి, ఎంపీడీవో సత్తయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డిలు సోమవారం తెలిపారు. త్వరలోనే పనులను ప్రారంభించి రైతులు, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ఉమ్మడి మానాలను పాత జిల్లాలో కలపాలి

రుద్రంగి ఆగస్టు 12: ఉమ్మడి మానాల గ్రామాలను పాత జిల్లా నిజామాబాద్ జిల్లాలో కలపాలని సోమవారం ఉమ్మడి మానాల గ్రామాల ప్రజలు మానాలలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఉమ్మడి మానాల పార్లమెంట్లో నిజామాబాద్ నియోజకవర్గంలో, అసెంబ్లీ బాల్కొండ నియోజకవర్గంలో ఉందని మానాల గ్రామం మాత్రం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రుద్రంగి మండలంలో ఉందన్నారు.

సీఎం రేవంత్‌పై విమర్శలు సరికాదు

● రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఆగస్టు 12 : రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కొంతమంది వ్యక్తులు సోషల్ మీడియాలో పనిగట్టుకుని కారుకూతలు కూయడం సరైనది కాదని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రాన్ని పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చుతున్నారని, ముఖ్యమంత్రి అమెరికా పర్యటనతో తెలంగాణకు వేలాది కోట్ల రూపాయల పరిశ్రమలు వస్తున్నాయని అన్నారు. గతంలో మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో ఎంవోయూ కుదుర్చుకున్న కంపెనీలన్నీ ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయాయని విమర్శించారు. విదేశీ పర్యటనల పేరుతో దుబాయి వెళ్లి సొంత బిల్డింగులు కొనుక్కున్న బీఆర్ఎస్ నాయకులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పోలిక లేదన్నారు. కేటీఆర్ పదేళ్లలో కేవలం హడావిడి మాత్రమే చేశారని ఆయన హడావిడికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేవలం ఎనిమిది నెలల్లోనే సమాధానం చెప్పారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో వేలాది కోట్ల రూపాయల పరిశ్రమలు రాష్ట్రానికి రావడంతో టీఆర్ఎస్ పార్టీ నాయకులు ఓర్చుకోలేకుండా కేటీఆర్ సూచనల మేరకు సోషల్ మీడియాలో ఇష్టారీతిలో విమర్శిస్తున్నారన్నారు.

ప్రజావాణిలో విన్నపాల వెల్లువ

● ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి ● కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 12: తమ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు జిల్లా కలెక్టరేట్‌కు సోమవారం తరలివచ్చి ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రాలు సమర్పించారు. సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో సమస్యలను చెప్పుకునేందుకు జిల్లా నలుమూలలనుంచి తరలివచ్చారు. ప్రజావాణిలో 131 దరఖాస్తులు రాగా ఇందులో రెవెన్యూశాఖకు 74, చందుర్తి ఎంపీడీవోకు 1, జిల్లా వైద్యాఆరోగ్యశాఖకు 4, సిరిసిల్ల మున్సిపాల్టీకి 12, సిరిసిల్ల ఆర్టీసీ డిపోకు 1, కోనరావుపేట ఎంపీడీవోకు 2, జిల్లా సంక్షేమాధికారికి 5, ఎక్సైజ్‌శాఖకు 1, వ్యవసాయశాఖకు 5, వేములవాడ మున్సిపాల్టీకి 1, గంభీరావుపేట ఎంపీడీవోకు 1, ఎంప్లాయిమెంట్‌కు 3, విద్యాశాఖకు 1, డీసీఎస్‌వోకు 5, డీఆర్‌డీవోకు 2, ముస్తాబాద్ ఎంపీడీవోకు 2, డీఎండ్యూవోకు 1, జిల్లా పంచాయతీ అధికారికి 3, సెస్‌కు 2, ఎల్లారెడ్డిపేట ఎంపీడీవోకు 1, అగ్రహారం డీగ్రీ కళాశాల 1, ఇల్లంతకుంట ఎంపీడీవోకు 1 , సర్వేయర్‌కు 1, సీపీవోకు 1 చొప్పున ఫిర్యాదు, వినతిపత్రాలు, అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి త్వరితగితన పరిష్కారం చూపపడంతో పాటు అర్జీదారులకు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగాయకుడు గద్దర్ విగ్రహాలను ఏర్పాటు చేయాలి

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంతోపాటు వేములవాడ మున్సిపాల్టీలతోపాటు అన్ని మండల కేంద్రాల్లో ప్రజా గాయకుడు ప్రజాయుద్ధనౌక మహనీయుడు గద్దర్ విగ్రహాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ప్రజా సమీకృత సేవా కమిటి అధ్యక్షుడు గొట్టె రవివర్మ కోరారు. ఈమేరకు సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో నరేష్‌నాయక్, రమేష్, దర్శనాల కిషన్, చంద్రరెడ్డి,



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

రాజు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మండెపల్లి కేసీఆర్‌నగర్‌ను గ్రామపంచాయతీ చేయాలి

తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులో రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన కేసీఆర్‌నగర్ డబుల్ బెడ్ రూంల సముదాయాన్ని గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని కాలనీవాసులు సోమవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కలిసి వినతిపత్రాన్ని అందించారు. మున్సిపల్ సిబ్బంది సరిగా రావడం లేదన్నారు.

రుద్రవరంలో 22 కుటుంబాలకు ఇళ్లపట్టాలను ఇప్పించాలి

వేములవాడ అర్బన్ మండలంలోని రుద్రవరం నక్కల కాలనీలో నివాసం ఉంటున్న 22 కుంటుబాలకు ఇళ్ల పట్టాలను అందించాలంటూ భాధితులు సోమవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కలిసి వినతిపత్రాన్ని అందించారు. కాలనీ మిడ్‌మానేరు డ్యాంలో మునిగిపోవడంతో 41 కుటంబాలకు పునరావాసం కింద ప్లాట్‌లను అందించారని మిగిలిన 22 కుటుంబాలకు ఇవ్వాలని కోరారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన కేటీఆర్

ముస్తాబాద్, అగస్టు 12: ముస్తాబాద్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యకర్తలను, వారి కుటుంబాలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే కె తారకరామారావు సోమవారం పరామర్శించారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాధవనేని ఆనందర్‌రావు తండ్రి వెంగళరావు ఇటీవల మరణించగా ఇంటికి వెళ్లి పరామర్శించారు. మాజీ సర్పంచ్ గుండెల్లి రాములు తల్లి లక్ష్మీ మరణించగా కుటుంబ సభ్యులను పరామార్శించారు. ఏఎంసీ మాజీ డైరెక్టర్ ముక్క మల్లయ్య కొడుకు కృష్ణ అనార్యోగంతో మరణించగా ఆ కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ 50 వేల ఆర్థిక సాయం అందించారు. అలాగే స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గ్రామ శాఖ అధ్యక్షుడు జగ్గ నరేశ్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి, టీఎస్‌పీఎస్‌సీ మాజీ మెంబర్ డాక్టర్ చంద్రశేఖర్‌రావు, విజయామారావు, సంతోష్‌రావు, రమేశ్‌రెడ్డి, చెవుల మల్లేశ్, శ్రావణ్‌రావు, నల్ల నర్సయ్య, స్వర్ణలత, నవీననందు, సుమతి, నాని తదితరులు పాల్గొన్నారు.

నర్సింగాపూర్‌ను రెవెన్యూ గ్రామంగా మార్చాలని కలెక్టర్‌కు వినతి

చందుర్తి, ఆగస్టు 12: చందుర్తి మండలం నర్సింగాపూర్‌ను రెవెన్యూ గ్రామంగా మార్చాలని గ్రామ యువకుడు పెరిక గంగరాజు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నర్సింగాపూర్ గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా మార్చాలని, గ్రామంలో నిర్మిస్తున్న గ్రామపంచాయతీ భవనం నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని, గ్రామంలో పోస్ట్ ఆఫీస్‌ను మంజూరు చేయాలని కలెక్టర్‌కు విన్నవించినట్లు తెలిపారు.

బీజేవైఎం నాయకుల ఆందోళన

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 12: గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం నాయకులు సోమవారం ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఏకలవ్య ఆదర్శ పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. గురుకులం ప్రధాన ద్వారం వద్ద బైఠాయించారు. విద్యార్థుల సమస్యలను తీర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్రంలోని గురుకులాల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జ్వరాల బారిన పడడంతో పాటు విషజీవుల వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జితేందర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, బాలకిషన్, నరేందర్, చందు, మహేశ్, రోహిత్, సంపత్, సంతోష్ పాల్గొన్నారు.

కూలీ తగ్గించిన యాజమాన్యంపై చర్య తీసుకోవాలి

సిరిసిల్ల రూరల్, అగస్టు 12: సిరిసిల్లలో వరమగ్గాల కార్మికులకు కూలీ తగ్గించి ఇస్తున్న వస్త్ర పరిశ్రమల యజమానులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని పాలిస్టర్ అసోషియేషన్ భవనంలో సోమవారం సీఐటీయూ పవర్‌లూంవర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాయకులు అధ్యక్షుడు అడెపు భాస్కర్‌ను కలిసి సమస్యలను విన్నవించి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ సిరిసిల్లలో పాలిస్టర్ వస్త్రానికి సంబంధించిన కొంత మంది యాజమానులు ఒప్పందం ప్రకారం కాకుండా కార్మికులకు కూలీ తగ్గించి ఇస్తున్నారని అన్నారు. దీనివలన మరమగ్గాల కార్మికులు చాలా నష్టపోతున్నారన్నారు. పాలిస్టర్ వస్త్రానికి సంబంధించి 2022 సంవత్సరం కార్మికులకు కూలీ పెద్దపన్నకు 10 పిక్కులకు 0.26 పైసలు, చిన్నపన్నకు 0.25 పైసలు కూలీ పెంచుతూ ఒప్పందం జరిగిందన్నారు. కానీ ప్రస్తుతం కొంతమంది యాజమానులు కార్మికులకు ఒప్పందం ప్రకారం కాకుండా కూలీని తగ్గించి ఇవ్వడం జరుగుతుందన్నారు. దీని వలన కార్మికులకు సరైన వేతనాలు రాక ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని గతంలో పాలిస్టర్ అసోషియోషన్ ఆధ్వర్యంలో జరిగిన ఒప్పందం ప్రకాం కార్మికులకు కూలీని తగ్గించకుండా ఒప్పందం ప్రకారమే కూలీ చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అన్నల్‌దాస్ గణేష్, స్వర్గం శేఖర్, కుమ్మరికుంట కిషన్, ఎక్కల్‌దేవి జగదీష్ తదితరులుపాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

ఇంటింటా జాతీయ జెండా ఎగురవేయాలి

సిరిసిల్ల రూరల్, అగస్టు 12 : హర్‌ఘర్‌కా తీరంగా కార్యక్రమంలో భాగంగా ప్రజలందరూ తమ ఇళ్లపై జాతీయ జెండాలను ఎగురవేయాలని బీజేపీ హర్‌ఘర్‌కా తిరంగా సిరిసిల్ల పట్టణం ఇన్‌చార్జి మ్యానరాంప్రసాద్, ఊరగొండ రాజులు కోరారు. భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పిలుపుమేరకు సోమవారం సిరిసిల్ల పట్టణంలోని స్వాతంత్ర్య సమరయోధులైన సర్దార్ వల్లభాయ్ పటేల్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, నేతాజీ సుభాష్‌చంద్రబోస్ విగ్రహాలను బీజేపీ నాయకులు నీటితో శుభ్రం చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గుడూరి భాస్కర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాసరి శ్రీనివాస్, కంచర్ల పర్శరాములు, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెల్లి వేణుగోపాల్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు వంగ అనిల్‌కుమార్‌గౌడ్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు అంకారపు రాజు, మహిళా మోర్చ పట్టణ అధ్యక్షురాలు పండుగ మాధవి, వాణిజ్యసెల్ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, బూర విష్ణు, ఎనుగంటి నరేష్, రాయిని ప్రతాప్, గుండెల్లి శ్రీనివాస్, బాలసాని అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో సర్దార్ వల్లభాయ్‌పటేల్ విగ్రహం వద్ద బీజేపీ నాయకులు



సిరిసిల్లలో నిర్వహిస్తున్న విజయోత్సవ ర్యాలీ

ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీ

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 12 : ఎస్సీ వర్గీకరణ కోసం 30 సంవత్సరాల సుదీర్ఘ పోరటం ఫలించడంతో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తా నుంచి పట్టణ ప్రధాన రహదారుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పోరాట ఉద్యమంలో ఎన్ని ఎత్తు పల్లాలు ఎదురైనా వెనకడుగు వేయకుండా పోరాటలు చేశామన్నారు. కొందరు వ్యతిరేకించిన మొక్కవోని దీక్షతో మంద కృష్ణ చేసిన పోరాటం చరిత్రలో స్థిరాస్థాయిగా నిలుస్తుందన్నారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమం పోరాటంలో అమరులైన బిడ్డల త్యాగాలు మరవలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు ఖానపురం లక్ష్మన్, ఆవునూరి ప్రభాకర్, గుండా థామస్, మాదిగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్, వెంకటరాములు, పంగ రవి పాల్గొన్నారు.

అటవీ భూముల ఆక్రమణ

కోనరావుపేట, ఆగస్టు 12: నిమ్మపెల్లి అటవీ ప్రాంతంలో వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు అటవీ ప్రాంతంలో చెట్లను నరికివేస్తూ ట్రాక్టర్ల ద్వారా అటవీ భూములను సాగు చేస్తున్నారు. ఇప్పటికే కొంతమంది అటవీ భూములను ఆక్రమించుకొని పంటలు వేస్తుండగా మరి కొంతమంది చెట్లను నరికివేసి ట్రాక్టర్ల ద్వారా చదును చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి అటవీ భూములను కాపాడాలని నిమ్మపెల్లి గ్రామస్థులు కోరుతున్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 12: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గొల్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు సోమవారం వాహన తనిఖీలు చేశారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 12: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తు పనుల దృష్ట్యా మంగళవారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతోందని సెస్ ఏఈ పృథ్వీధర్ ఓ ప్రకటనలో తెలిపారు.ఉదయం9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎల్లారెడ్డిపేట, దుమాల, పదిర గ్రామాలకు కరెంటు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ప్రభుత్వ సలహాదారుడిని కలిసిన మాజీ సర్పంచ్

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 12: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ తాజా, మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి సోమవారం ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లానిమాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి తెలిపారు.

చందుర్తి సింగిల్ విండో సీఈవోగా శ్రీవర్ధన్

చందుర్తి, అగస్టు 12: చందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈఓగా శ్రీవర్ధన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. చందుర్తి సింగిల్ విండో సీఈవో గంగారెడ్డి సస్పెన్షన్ కాగా ఆయన స్థానంలో సనుగుల సింగిల్ విండో సీఈవో శ్రీవర్ధన్‌కు బాధ్యతలు అప్పగించారు.

పేదలకు అండగా సీఎం సహాయ నిధి

కోనరావుపేట, ఆగస్టు 12: పేదవారికి అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి ఉపయోగపడుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా అన్నారు. మండలంలోని కనగర్తి గ్రామంలో సోమవారం పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చేక్కులను అందజేశారు. కాంగ్రెస్ నాయకులు తాళ్లపెల్లి ప్రభాకర్, నాయని ప్రభాకర్ రెడ్డి, బుర్ర రవీందర్, బోయిని దేవరాజు, మారుపాక శంకర్, లక్ష్మారెడ్డి, ముత్తయ్య, అనిల్, మైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులోని ధూప్యానాయక్ తండాకు చెందిన కౌన్సిలర్ భూక్య రెడ్డినాయక్ సోదరుడు అమీన్‌నాయక్ కుమారుడైన భూక్య పవన్‌నాయక్ - శిరీష దంపతులను సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్ నాయకులు ఆశీర్వదించారు.

● సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం అవ్వ, తాతలకు విద్యార్థులు పోస్ట్ కార్డు ఉత్తరాలను రాశారు. సిరిసిల్లకు చెందిన పత్తిపాక ఫౌండేషన్, భీమునిమల్లారెడ్డిపేటకు చెందిన గరిపెల్లి ట్రస్ట్‌లు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తరాలు రాశారు.

● సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ ప్రభుత్వ పాఠశాలకు బీరువాను గుజ్జె తారపురుషోత్తం దంపతులు తన మనుమడు గుజ్జె చైత్విక్ పుట్టిన రోజు సందర్భంగా అందించారు.

● ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు.

●ఇల్లంతకుంట: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

మాదకద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత



వీర్నపల్లిలో మొక్కలు నాటుతున్న ఎస్సై, ఉపాధ్యాయులు



అగ్రహారం కళాశాలలో మాట్లాడుతున్న ఏఎస్పీ చంద్రయ్య

వీర్నపల్లి, ఆగస్టు 12: మాదకద్రవ్యాల నిర్మూలన అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఎస్సై ఎల్లాగౌడ్ కోరారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్ వినియోగంతో యువత విలువైన జీవితాలను నష్టపోతున్నారని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులు ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పోలీసులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విశ్వనాథం, సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ బాబు, మల్లాగౌడ్, నయూమ్, మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● రుద్రంగి: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రుద్రంగి ఎస్ఐ అశోక్ అన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఎస్సై సిరిసిల్ల అశోక్ ఆధ్వర్యంలో రుద్రంగి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ హైస్కూల్, కృష్ణవేణి హైస్కూల్‌లలో విద్యార్థులచే గంజాయి, మత్తు పదార్థాలను నిరోధించాలని సోమవారం ప్రతిజ్ఞ చేయించారు.

● ఎల్లారెడ్డిపేట: యువత మత్తును వదిలి పట్టుదలతో చదివితే బంగారు భవిష్యత్ ఉంటుందని ఎస్ఐ రమాకాంత్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిరోధంపై సోమవారం ఆయన అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు పర్శరాములు, చంద్రమౌళి, విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి: విద్యార్థులు దేశ ప్రగతిని ముందుకు తీసుకువెళ్లాలని సీఐ మొగిలి అన్నారు. సోమవారం అంతర్జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకుని తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాలపై జరిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శంకర్ నారయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్ : దేశ ప్రగతిని ముందుకు తీసుకువెళ్లాల్సింది విద్యార్థులేనని సిరిసిల్ల ఏఎస్పీ చంద్రయ్య అన్నారు. వేములవాడ మండలం అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై విద్యార్థులకు అవగహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజగోపాల్, జిల్లా సంక్షేమ అధికారి, సీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఏఎస్ఐ బాపు అన్నారు. నషాముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తాసిల్దార్ కార్యాలయంతో పాటు ప్రభుత్వ కళాశాల విద్యార్థులతో సోమవారం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు యుక్త వయసులో చెడు వ్యసనాల బారిన పడే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ భవిష్యత్తుపై దృష్టి సారించాలన్నారు. డ్రగ్స్, గంజాయి, మద్యం లాంటి చెడు వ్యసనాల వలన జీవితాలు కుటుంబాలు నాశనం అవుతాయన్నారు. కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాస్, ఏఎస్ఐ సతీష్, ఐసిడిఎస్ సూపర్వైజర్ శంకరమ్మ, ఏపీఎం రజిత కళాశాల అధ్యాపక బృందం ఉన్నారు.